సాక్షి గుంటూరు

శనివారం, 30, సెప్టెంబర్, 2023



ఆలయాల హుండీల లెక్కింపు

పొన్నూరు : సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానంలోని 20 హుండీలను శుక్రవారం లెక్కించగా రూ.6.81.958 ఆదాయం వచ్చిందని ఈఓ టి.శ్రీనివాసరావు తెలిపారు.



మోస్తరు వర్షాలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 29 వరకు 214.4 మి.మీ వర్షపాతం నమోదైంది.



అమరేశ్వరుని హుండీ ఆదాయం

అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి గుడిలో శుక్రవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. రూ. 7.17.328 ఆదాయం వచ్చినట్లు ఈవో గోపీనాథశర్మ తెలిపారు.

న్యూస్‌రీల్

అక్టోబర్ 3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్ : గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో అక్టోబర్ 3న పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీసీపీ, ఈసీఈ, ఏఎఫ్‌టీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థినులు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజుతో సహా హాజరు కావాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులకు వసతి గృహం కలదని, వివరాలకు 9912342015 నంబర్లో సంప్రదించాలని వెల్లడించారు.

పులివెందుల స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల స్పోర్ట్స్ అకాడమీలో వివిధ క్రీడలకు సంబంధించి ప్రవేశాలు జరుగుతాయని డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన ఎంపిక ప్రక్రియ జిల్లా క్రీడాకారులకు వచ్చే నెల 3 నుంచి 5 వరకు స్థానిక బీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేశామన్నారు. హాకీ, బాడ్మింటన్, బాస్కెట్ బాల్, టెన్నిస్, వాలీబాల్ విభాగాల్లో సెలక్షన్స్ ఉంటాయని చెప్పారు. 12 నుంచి 18 సంవత్సరాల వయస్సున్న బాలురు పాల్గొనవచ్చని చెప్పారు.

అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ (బీఆర్ఏఓయూ) దూరవిద్య బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరేందుకు తుది గడువు ఈనెల 30న ముగియనున్నట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ అధ్యయన కేంద్ర ప్రాంతీయ సమన్వయకర్త పి.గోపీచంద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా యూజీ ద్వితీయ, తృతీయ, పీజీ ద్వితీయ సంవత్సర ఫీజులను చెల్లించేందుకు సైతం తుది గడువు ఈనెల 30న ముగియనుందని పేర్కొన్నారు. వివరాలకు 0863-2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి స్వచ్ఛ హీ సేవా కార్యక్రమం

కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆదేశాల మేరకు అక్టోబరు ఒకటో తేదీ నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో ఉదయం 10 గంటల నుంచి స్వచ్ఛ పక్వాడా-స్వచ్ఛ హీ సేవ కార్యక్రమం ఒక గంటపాటు నిర్వహించాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ శుక్రవారం ఆదేశించారు. గుర్తించిన ప్రదేశాలు, వీధులు, ప్రార్థనా మందిరాలు, విద్యా సంస్థలు, రైల్వే స్టేషన్లలో వ్యర్థాలను తొలగించి శుభ్రంచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్వయం సహాయక గ్రూపులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు పాల్గొనాలన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోండి

కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా 30వ తేదీ శనివారం ఉదయం 7.30 గంటల నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యశాఖ అధికారులతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్షపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ముందుగానే ప్రజలందరికీ సురక్ష కార్యక్రమం గురించి తెలియజేయాలని ఆదేశించారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, గర్భకోశ, ఎముకల, చెవి, ముక్కు, గొంతు, గుండె వ్యాధి వైద్య నిపుణులు హాజరవుతారని పేర్కొన్నారు. 120 రకాల మందులు అందుబాటులో ఉంటాయని వివరించారు. అవసరమైన ల్యాబ్ పరీక్షలు చేస్తారని వివరించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, డీడీవో మహాలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేత



లక్ష్మీపురం(గుంటూరు): అగతవరప్పాడు(గడ్డిపాడు) రైల్వేగేటును ట్రాక్ మరమ్మతుల నిమిత్తం అక్టోబర్ 1 నుంచి మూసివేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు 5వ తేదీ వరకు గేటును మూసివేస్తున్నట్లు ప్రత్యేకంగా ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు.

పచ్చల హారమై.. ధగధగల నగమై

కొండవీడు శోభాయమానం

- మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం
- నగరవనంలో భాగంగా ప్రగతికి బాటలు
- కాలగర్భంలో కలిసిన చారిత్రక ఆనవాళ్ల వెలికితీత
- అందంగా రూపుదిద్దుకోనున్న మూడు పార్కులు
- రాజుల కాలంలో ప్రసిద్ధిగాంచిన ప్రదేశాల ఆధునికీకరణ
- అటవీశాఖ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ముందడుగు



కొండవీడు అభివృద్ధిపై అటవీశాఖ అధికారి రామచంద్రరావుకు సూచనలు చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని (ఫైల్)



వంపుసొంపుల ఘాట్‌రోడ్డు

యడ్లపాడు: కొండవీడు భావితరాలకు అందించాల్సిన చారిత్రక ఖజానా. ప్రకృతి రమణీయతకు ఆలవాలం.. అబ్బురపరిచే విశేషాల సమాహారం.. కళ్లు చెదిరే సుమనోహర దృశ్యాల సుందర నగం.. పచ్చదనంతో పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే అద్భుత విహారకేంద్రం.. సందర్శకులతో నిత్యం శోభిల్లుతున్న అందాల బృందా'వనం'.. అందుకే కొండవీటి కోటను మరింత అభివృద్ధి చేయాలని ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. కొండవీడు-నగరవనం కార్యక్రమం ద్వారా చారిత్రక కట్టడాల ఆధునికీకరణకూ శ్రీకారం చుట్టింది. దీనికోసం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రత్యేక శ్రద్ధతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేయించి అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రణాళికలు రచిస్తున్నారు. ఇప్పటికే ఘాట్ రోడ్డు మొదలు, స్వాగత ద్వారం, చిల్డ్రన్స్ పార్కు, చెరువుల అభివృద్ధితోపాటు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, సోలార్ దీపాలు వంటి వసతులు కల్పించారు. పర్యాటక సొబగులు అద్దారు.

చారిత్రక ప్రదేశాలకు మార్గం సుగమం

కొండపైన ఎత్తైన ప్రదేశాల నుంచి అందాలను తిలకించేందుకు వ్యూ పాయింట్లుగా ఉన్న తారా బురుజు, జెట్టిబురుజులకు ఇప్పటివరకు వెళ్లే మార్గం లేదు. పుట్టాలమ్మ చెరువు వద్ద 20 అడుగుల ఎత్తులో ఉన్న మండపాన్ని చేరుకోవాలన్నా కష్టమే. దీంతో అధికారులు ఈ మూడు చోట్ల జంగిల్ క్లియరెన్స్ చేసి సందర్శకులు వాటిని చేరుకునేలా మార్గం సుగమం చేశారు. తాజాగా శతాబ్దాల నాటి పురాతన బావి, నాడు ప్రసిద్ధి చెందిన రెండు ప్రత్యేక ప్రదేశాలను సందర్శకులకు అందుబాటులోకి తెచ్చేందుకు శ్రీకారం చుట్టారు. త్వరలోనే మేళ్లదిబ్బ, జడ్డిగాల బావి, బ్రిటిష్ కాలంనాటి గెస్ట్‌హౌస్ వెనుక ఉన్న స్థలాల్లో మొత్తం మూడు పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

గెస్ట్‌హౌస్ వెనుక..

కోట గ్రామం నుంచి మెట్లమార్గం ద్వారా కొండపైకి వెళితే బ్రిటిషుల కాలంలో నిర్మించిన గెస్ట్‌హౌస్ దర్శనమిస్తోంది. దీని వెనుక భాగంలో సుమారు ఎకరం మైదాన స్థలం ఉంది. చిట్టడివిలా ఉండే ఇక్కడి ప్రదేశంలో ఎత్తైన చెట్లు ఎక్కువగా ఉన్నందుగా నిత్యం చల్లని వాతావరణం ఉంటుంది. కాబట్టే దీనిని పరిశుభ్రం చేసి సందర్శకులు భోజనాలు చేసుకుని కాస్తంత విశ్రాంతి తీసుకునేలా పార్కును తీర్చిదిద్దాలని అధికారులు చర్యలు చేపట్టారు.



పార్కు కోసం సిద్ధం చేసిన స్థలం

గృహరాజ సౌధం.. మేళ్లదిబ్బ

ఘాట్‌రోడ్డు ప్రారంభంలో చెక్‌పోస్టుకు కుడివైపున రెండెకరాల్లో ఎత్తైన ప్రదేశముంది. స్థానికులు మేళ్లదిబ్బగా పిలిచే ఈ ప్రాంతం 14వ శతాబ్దంలో గృహరాజ సౌధంగా ప్రసిద్ధి. ఇక్కడ ఒకే కలపతో దారు మందిరం(ఒకే మానుతో ఒంటి స్తంభం మేడ)ను నిర్మించారు. ఎత్తైన శిఖరాలు బంగారం, మణిమాణిక్యాలతో ధగధగలాడే ఈ సౌధంలో 'ఆదిలక్ష్మి కామేశ్వరి' అమ్మవారిని మూలస్థానంలో స్థాపించి రాజ కుటుంబీకులు మాత్రమే పూజించారని ప్రతీతి.



మేళ్లదిబ్బ ప్రాంతంలో పనులు చేస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కొండవీడు-నగరవనం కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు నిర్వహిస్తోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రత్యేక చొరతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ఇక్కడ ఒక్కొక్క ప్రాజెక్టు చొప్పున నిరంతరం ఎన్నో అభివృద్ధి పనులు చేస్తూ సందర్శకులకు అందుబాటులోకి తెస్తున్నాం.

– ఎస్.రామచంద్రరావు, జిల్లా అటవీశాఖ అధికారి

మూడు కోనేరుల సమాహారం.. జడ్డిగాల బావి



జడ్డిగాల బావి ప్రాంతం

మేళ్లదిబ్బ సమీపంలో పురాతనమైన మూడు కోనేరులు ఉన్నాయి. వీటిలో జడ్డిగాలబావి పెద్దది. ఇది 100 అడుగుల పొడవు, 35 అడుగుల వెడల్పు, 30 అడుగుల లోతైనది. ఈ బావినీటినే ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలకు, తాగునీటికి వినియోగించారని చెబుతారు. వీటిని పెదకోమటి వేమారెడ్డి నిర్మించినట్లు చెబుతున్నా..'కళావాస్'గా ప్రసిద్ధి చెందిన కుమారగిరి రెడ్డి అని చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఆయనే ఎన్నో క్రీడా సరస్సులు తవ్వించాడని, వినోద రథాలనూ తయారు చేయించాడని కవి సార్వభౌముడు శ్రీనాథుడు రచించిన ఫిరంగిపురం శాసనం వెల్లడిస్తోంది.

కన్ను పడిందా కన్నమే

- దొంగల ముఠా అరెస్టు
- పట్టించిన సీసీ కెమెరాలు
- విచారణలో బయటపడిన మరిన్ని చోరీలు
- రూ 22.7 లక్షల విలువైన వస్తువులు, నగదు రికవరీ
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



స్వాధీనం చేసుకున్న నగదు, నగలను చూపిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట: సత్తెనపల్లి, గురజాల సబ్ డివిజన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను సత్తెనపల్లి రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ముగ్గురు సభ్యులు ఉన్న ఈ గ్యాంగ్ కన్ను ఏ ఇంటిపైనైనా పడిందంటే కన్నం వేయాల్సిందే. పగలు, రాత్రి అనే భేదం అసలు ఉండదు. ఇప్పటివరకు ఈ ముఠా ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏడు చోరీలకు పాల్పడింది. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి తన కార్యాలయంలో కేసు వివరాలను విలేకరులకు వివరించారు. ఆయన కథనం ప్రకారం..

నకరికల్లు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉండే షేక్ జైనబ్ కుటుంబం ఈ నెల 5న పని నిమిత్తం నరసరావుపేటకు వెళ్లింది. మధ్యాహ్నం 3.20 గంటల సమయంలో దొంగల ముఠా ఇంటి తాళాలు పగలగొట్టి 150.696 గ్రాముల బంగారం, రూ.7.50 లక్షల నగదును అపహరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నకరికల్లు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఓ దొంగ నడక ఆధారంగా నిందితులను గుర్తించారు. గురజాల పట్టణానికి చెందిన రుద్రాల సురేష్, మహంకాళి గణేష్, ఎక్కులూరి నరేష్ ఈ చోరీ చేసినట్లు విచారణలో తేలింది. సత్తెనపల్లి రూరల్ సీఐ ప్రేమయ్య శుక్రవారం తన సిబ్బందితో కారెంపూడి క్రాస్ రోడ్డు వద్ద కారులో వెళ్తున్న ముగ్గురు దొంగలను అరెస్ట్ చేశారు.

90 శాతానికి పైగా సొత్తు రికవరీ

ముగ్గురు దొంగలను వేరువేరుగా పోలీసులు విచారణ చేశారు. దీంతో ఈ ఏడాదిలో తాము ఏడు దొంగతనాలు చేసినట్టు వారు ఒప్పుకున్నారు. అన్ని చోరీల్లో కలిపి సొత్తు విలువ రూ.24.5 లక్షలుగా పోలీసులు లెక్కకట్టారు. ఇందులో రూ.22.70 లక్షల విలువైన బంగారం, నగదును పోలీసులు రికవరీ చేశారు. మొత్తం 363.95 గ్రాముల బంగారాన్ని వీరు అపహరించగా మొత్తం రికవరీ చేయడం విశేషం. వీరి నుంచి మారుతీ షిఫ్ట్ డిజైర్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఈ ముగ్గురూ స్నేహితులు. కార్లను బాడుగకు తీసుకొని తాళాలు వేసిన ఇళ్లను రెక్కీ చేసి, స్క్రూడ్రైవర్ సహాయంతో తాళాలు పగలుగొట్టి చోరీలు చేయడం వీరికి వెన్నతోపెట్టిన విద్య. గతంలో రుద్రాల సురేష్ మీద 14 కేసులు, మహంకాళి గణేష్ మీద 3 కేసులు నమోదయ్యాయి. తక్కువ సమయంలో నిందితులను పట్టుకొని, వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకొన్న సీఐ ప్రేమయ్య, సిబ్బందిని ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు అందించారు.

సంక్షేమ హా'రన్'



వాహనమిత్ర నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, క్రిస్టినా తదితరులు

- డ్రైవర్లకు ఆర్థిక భరోసా
- జిల్లాలో 12,545 మందికి వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధి
- రూ.12.54 కోట్ల మేర ప్రయోజనం

గుంటూరు వెస్ట్ : ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ వాహన మిత్ర ఐదో విడత నగదును బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా జిల్లాలో 12,545 మందికి రూ.12.54 కోట్లు నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేశారని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఆటో, ట్యాక్సీ, క్యాబ్ తదితర వాహనదారులకు లబ్ధిచేకూరుతుందని చెప్పారు. పేదలకు కొండంత అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తోందని పేర్కొన్నారు. అనంతరం నమూనా చెక్కును కలెక్టర్, హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వృద్ధులు, వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పఠాన్ ముంతాజ్, ఆర్అండ్‌బీ డైరెక్టర్ పిల్లి మేరి, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ ఆబిదా బేగం, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు.

ఐదేళ్ల నుంచి వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019–20	20,954	20.95
2020–21	25,177	25.17
2021–22	23,127	23.12
2022–23	12,108	12.10
2023–24	12,545	12.54
మొత్తం	93,911	93.88

దిగులు లేదు



ఏటా ఇన్సూరెన్స్ కట్టాలి. వాహనాలకు క్రమం తప్పకుండా మరమ్మతులు చేయించాలి. ఆ సమయానికి వడ్డీకి డబ్బులు తీసుకుని ఇబ్బందులు పడే వాళ్లం. ఇప్పుడు ఏటా రూ.10 వేలు అందుతుండడంతో దిగులు లేదు. వరుసగా ఐదో ఏడాది లబ్ధి అందింది. మొత్తం రూ.50 వేలు అందాయి.

– జె.శ్రీనివాసరావు, ఆటో డ్రైవర్, గుంటూరు

పీఏసీఎస్‌లకు సహకారం

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము



సమావేశంలో మాట్లాడుతున్న లాలుపురం రాము వేదికపై యార్లగడ్డ భాగ్యలక్ష్మి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్), ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)లకు గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఎల్లవేళలా సహాయ, సహకారాలను అందిస్తోందని ఆ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము స్పష్టం చేశారు. కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో జీడీసీఎంఎస్ మహాజన సభ సమావేశం ఆ సొసైటీ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముందుగా జీడీసీఎంఎస్ 2021-22 ఆడిట్ రిపోర్టు, జమాఖర్చులను బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం సభ ముందు ప్రవేశపట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం జీడీసీసీబీ చైర్మన్ రాము మాట్లాడుతూ మూడేళ్లుగా సహకార రంగంలో వస్తున్న కొత్త అవకాశాలను సొసైటీలు అందిపుచ్చుకోవాలని సూచించారు. కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటు, కంప్యూటరీకరణ, పెట్రోలు బంకులు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్, తదితర వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకుని పీఏసీఎస్‌లు లాభాల బాట పట్టాలన్నారు. వ్యవసాయమే దండగా అంటూ రైతులను చంద్రబాబు నట్టేట ముంచితే.. సేద్యాన్ని పండగ చేసి రైతులకు అన్ని విధాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దన్నుగా నిలిచారని కొనియాడారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడంతోపాటు, ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులను రైతులకు అందించాలని కోరారు. రాష్ట్రంలోనే గుంటూరు డీసీఎంఎస్ ప్రథమ స్థానంలో ఉండడం సంతోషమన్నారు. డీసీఎంఎస్ ఉద్యోగులు, సిబ్బంది, రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం మాట్లాడుతూ 2022-23 సంవత్సరం ఆడిట్‌ను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2022-23 ఖరీఫ్ సీజన్‌లో 44 డీసీఎంఎస్ సేల్స్ పాయింట్ల ద్వారా 69,219.52 మెట్రిక్ టన్నుల ధాన్యం, రబీ సీజన్‌లో 23,189.52 మెట్రిక్ టన్నుల ధాన్యం, 3,381.40 మెట్రిక్ టన్నుల శనగలు, 7,291 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు కొనుగోలు చేసినట్టు వెల్లడించారు.

డీసీఎంఎస్ ద్వారా విశిష్ట సేవలు

- జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి

జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 44 డీసీఎంఎస్ సేల్స్ పాయింట్ల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువుల అమ్మకాలు సాగిస్తున్నామన్నారు. పురుగుమందుల అమ్మకాలు, ధాన్యం, మొక్కజొన్న, శనగల కొనుగోళ్లు కూడా చేస్తున్నట్లు వెల్లడించారు. 2022-23లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ, ప్రొవిజన్స్ ద్వారా రూ.69.26 కోట్ల వ్యాపారం చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.16.02 కోట్ల వ్యాపారం చేసినట్టు వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ముందుందు రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు.

సమావేశంలో డీసీఎంఎస్ పాలకవర్గ సభ్యులు ఆరుమళ్ళ వెంకట శివ, ఆరికట్ల విజయ భాస్కరరెడ్డి, ప్రసాదం బాల గురవమ్మ, పాల్వాయి ఆదినారాయణ, దాసరి రాజు, కుర్రా పాములు, జీడీసీసీబీ పాలకవర్గ సభ్యులు, డీసీఎంఎస్ కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, నిజాంపట్నం రైతు సలహా మండలి అధ్యక్షుడు యార్లగడ్డ మదన్ మోహన్, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 పీఏసీఎస్‌ల చైర్మన్లు, ఇతర సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఆతుకూరి



పాత గుంటూరు: ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కొత్త అధ్యక్షుడిగా ఆతుకూరి ఆంజనేయులు ఎన్నికయ్యారు. శుక్రవారం జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 3,100 మంది వ్యాపారులు చాంబర్‌లో సభ్యత్వం కలిగి ఉన్నారు. ఎన్నికల్లో మొత్తం 700 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి మాత్రమే ఎన్నిక నిర్వహించగా ఆతుకూరి ఆంజనేయులు, రంగా బాలకృష్ణ పోటీలో నిలిచారు. మిగిలిన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంజనేయులుకు 407 ఓట్లు రాగా, రంగా బాలకృష్ణకు 244 ఓట్లు పోలయ్యాయి. 163 ఓట్ల తేడాతో ఆంజనేయులు 34వ సారి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఎన్నిక అయినట్లు చాంబర్ కార్యదర్శి అన్నా పూర్ణచంద్రరావు తెలిపారు.

క్లుప్తంగా

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వండి

కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



గుంటూరు వెస్ట్: జిల్లాలో కౌలు రైతులందరికీ బ్యాంకుల ద్వారా వీలైనంత త్వరగా రుణాలు మంజూరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే కౌలు రైతులకు విస్తృత స్థాయిలో సీసీ కార్డులు అందజేశామన్నారు. కార్డు అందజేసిన వారికి రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లాలో వరి సాగు చేసిన 14 మండలాల్లో వచ్చేనెల 4న జరుగనున్న సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. 2023–24 సంవత్సరానికి ఎంఐడీహెచ్ పథకం రూ. 8.52 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద రూ. 57.75 లక్షలు, ఎంపీ పథకం కింద రూ.14.02 లక్షలు మంజూరుకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకునే విధంగా ప్రచారం కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎస్.శివ రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర, ఇరిగేషన్ ఎస్‌ఈ ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

యార్డులో 25,459 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,996 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 25,459 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.14,000 నుంచి రూ.22,800 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,554 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

మహోన్నతుడు స్వామినాథన్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



డాక్టర్ వైఎస్సార్, స్వామినాథన్ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నేతలు

పట్నంబజారు: దేశంలో ఆకలితో ఏ ఒక్కరూ ఉండకూడదన్న లక్ష్యంతో జీవితాంతం పోరాటం సాగించిన మహనీయుడు ఎంఎస్ స్వామినాథన్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ కీర్తించారు. గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాయలంలో శుక్రవారం స్వామి నాథన్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ హరిత విప్లవ పితామహుడిగా పేరుగాంచిన ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ భౌతికంగా దూరంకావడం ఎంతో బాధాకరమన్నారు. వ్యవసాయ రంగానికి ఎనలేని మేలు చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సివిల్ సర్వీస్‌ను సైతం వదిలిపెట్టి..వ్యవసాయ పరిశోధనా రంగంలోకి వచ్చి ఆకలి లేని సమాజం కోసం పాటుపడ్డారన్నారు.

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ కరువు పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి వంగడాలను సృష్టించి రైతుల పాలిట దేవుడిగా నిలిచిన గొప్ప వ్యక్తి స్వామినాథన్ అని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధరపై ప్రభుత్వానికి విలువైన ప్రతిపాదనలు అందించటంతో పాటు, పంటల ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50శాతాన్ని మద్దతు ధరగా నిర్ణయించాలని సూచించిన మహోన్నతుడని కీర్తించారు. మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణతదితరులు మాట్లాడారు. ముందుగా స్వామినాథన్, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల నేతలు పలు కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జోసఫ్, గనిక ఝాన్సీ, స్మితా పద్మజ, మాదా రాధా, మల్లెమూడి సతీష్, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు వీరే

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు సంబంధించి పార్టీ మండల అధ్యక్షులను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి ప్రత్తిపాడు మండల అధ్యక్షుడిగా కట్టా సుబ్బారావు, పెదనందిపాడుకు ఖాశీంపీరా, వట్టిచెరుకూరుకు మన్నవ వీర నారాయణ, గుంటూరు రూరల్‌కు తుమ్మల సుబ్బారావు, జీఎంసీ క్లస్టర్ –1కు ఏటుకూరు విజయసారథి, జీఎంసీ క్లస్టర్–2కు బండారు శ్రీనివాసరావులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అదేవిధంగా పొన్నూరు నియోజకవర్గానికి సంబంధించి చేబ్రోలుకు షేక్ పెదమస్తాన్‌వలి, పెదకాకానికి చాగంటి మురళీమోహన్, పొన్నూరుకు రుద్రపాటి శేషు, పొన్నూరు మున్సిపాలిటీకి ఎం.డి.మొహమ్మద్., గుంటూరు తూర్పు నియోజకవర్గంలో క్లస్టర్–1కు తోటా ఆంజనేయులు, క్లస్టర్ –2 ఎం.డి. ఉస్మాన్ (హన్ను), క్లస్టర్–3 మాదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, క్లస్టర్–4కు మల్లవరపు రవిరాజు (అగ్గిపెట్టె రాజు), గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి క్లస్టర్–1కు గుడిపాటి భాస్కర్, క్లస్టర్–2కు బత్తుల దేవానంద్, క్లస్టర్ –3కి నూనె ఉమామహేశ్వరరెడ్డి, క్లస్టర్ –4కు బి.రవీంద్రనాథ్, క్లస్టర్–5కు బైరెడ్డి రంగారెడ్డిలు నియమితులయ్యారు.

తెనాలి నియోజకవర్గంలో తెనాలి మున్సిపాలిటీకి క్లస్టర్–1కు మద్దాళి శేషాచలం, తెనాలి మున్సిపాలిటి క్లస్టర్–2కు షేక్ మెహబూబ్‌బాషా, కొల్లిపరకు అవుతుపోతురెడ్డి, తెనాలి రూరల్‌కు చెన్నుబోయిన శ్రీనివాసరావు, తాడికొండ నియోజకవర్గానికి సంబంధించి తాడికొండకు బుర్రా వెంకటేశ్వరరెడ్డి, మేడికొండూరుకు తాళ్లూరి వంశీ, ఫిరంగిపురంకు మార్పుల శివరామిరెడ్డి, మంగళగిరి నియోజకవర్గానికి సంబంధించి తాడేపల్లి రూరల్‌కు మున్నంగి వివేకానందరెడ్డి, తాడేపల్లి టౌన్‌కు బుర్రముక్క వేణుగోపాలరెడ్డి, మంగళగిరి టౌన్‌కు ఆకురాతి రాజేష్, మంగళగిరి రూరల్‌కు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, దుగ్గిరాల మండలానికి శృంగారపాటి రత్నంను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

యువతిని కాపాడిన తాడేపల్లి పోలీసులు



కృష్ణానదిలో యువతిని బయటకు తీసుకు వస్తున్న ఎస్‌ఐ రమేష్

- అర్ధరాత్రి నదిలో దూకి ఆత్మహత్యాయత్నం
- వెంటనే స్పందించి రక్షించిన పోలీసులు
- మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విజయవాడ తరలింపు
- పోలీసులను అభినందించిన జిల్లా ఉన్నతాధికారులు

తాడేపల్లిరూరల్: స్థానిక పోలీసులకు మరోసారి అభినందనలు వెల్లువెత్తాయి. గురువారం అర్ధరాత్రి విజయవాడ రాణిగారి తోటకు చెందిన ఓ యువతి ఇంట్లో తల్లిదండ్రులతో గొడవ పడి.. ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై కనకదుర్గ వారధికి వచ్చింది. తాడేపల్లి వచ్చి గుంటూరు రోడ్డులో నుంచి విజయవాడ వెళ్లే వారధి రహదారిలో 26–27 పిల్లర్ల వద్ద బండి పార్క్ చేసి సదరు యువతి కృష్ణా నదిలోకి దూకింది. గమనించిన యువకుడొకరు పోలీసులకు సమాచారం అందించడంతో అటు విజయవాడ పోలీసులు, ఇటు తాడేపల్లి పోలీసులు కనకదుర్గ వారధి వద్దకు చేరుకున్నారు. మొదటగా తాడేపల్లి ఎస్‌ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, బీట్ కానిస్టేబుల్ షరీమ్ స్వామిలతో కలసి కృష్ణానదిలోకి వెళ్లారు. కృష్ణానది కనకదుర్గ వారధిపై కొంతమంది సిబ్బందిని పంపి యువతి ద్విచక్రవాహనం ఉన్న ప్రాంతం వద్ద చూడాలని సూచించారు. సుమారు 1.5 కిలోమీటర్లు ఇసుకలో నడుచుకుంటూ వెళ్లి నది నీటిలో అపస్మారక స్థితిలో పడిఉన్న యువతిని గుర్తించారు. ఒడ్డుకు తీసుకు వచ్చి నీటిని కక్కించి, ప్రాథమిక చికిత్స చేశారు. అప్పటికీ ఆ యువతి తేరుకోకపోవడంతో దుప్పటి సాయంతో యువతిని మోసుకుంటూ వారధి వద్దకు తీసుకు వచ్చారు. 108 సిబ్బందిని సిద్ధంగా ఉంచడంతో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యనిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే యువతి ఆరోగ్యానికి ఎటువంటి ఢోకా లేదని డాక్టర్లు చెప్పడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అర్ధరాత్రి యువతిని కాపాడిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. తమ సిబ్బంది సకాలంలో స్పందించి అతి కష్టం మీద యువతిని బయటకు తీసుకు వచ్చి ప్రాణాలు కాపాడారంటూ ప్రశంసించారు. అలాగే పోలీసులకు సమాచారం ఇచ్చిన యువకుడికి కూడా పోలీస్‌శాఖ తరుపున అభినందనలు తెలియజేశారు. తాడేపల్లి ఎస్‌ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణలను జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ రాంబాబు, సీఐ శేషగిరిరావు, పెదకాకాని సీఐ సురేష్ బాబులు అభినందించారు.

క్షేత్రస్థాయిలో సవాళ్లను అధిగమిస్తేనే విజయం

గుంటూరు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ దోనవల్లి లక్ష్మణ్



చేబ్రోలు: ఫార్మాస్యూటికల్ విద్యార్థులు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తేనే విజయం సాధించగలరని గుంటూరులోని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ దోనవల్లి లక్ష్మణ్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ''ప్రివెంటివ్ అండ్ ఎమర్జెన్సీ మెడికల్ సైన్సెస్'' అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కాన్ఫరెన్స్‌ను ''ఏ పారాడిమ్ షిఫ్ట్ ఆఫ్ క్లినికల్ ప్రాక్టీస్ ఫ్రమ్ హాస్పిటల్ టు కమ్యూనిటీ ఎట్ లార్జ్'' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియం కారే మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ విద్యార్థులకు మన దేశంతోపాటు, ఇతర దేశాలలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 410 మంది హాజరయ్యారు. చైర్మన్ లావు రత్తయ్య, సోమశేఖర రెడ్డి, ప్రిన్స్ అభిషేక్, ప్రిన్సిపల్ శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

నేడు లైవ్ ఐసీయూ ప్రారంభం



డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి

గుంటూరు మెడికల్: దేశంలోనే మొట్టమొదటిసారిగా లూసిడ్లీ ఇంటిగ్రేటెడ్ వైటల్ కేర్ ఇన్ ఎమర్జెన్సీ (లైవ్) కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా చిలకలూరి పేట ఏరియా హాస్పటల్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని శనివారం ప్రారంభిస్తారని శ్రీ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి చెప్పారు. శుక్రవారం గుంటూరు అరండల్‌పేటలోని సమిష్టి హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (శ్రీ)లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత ఆధునికమైన స్మార్ట్ ఐసీయూ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన ఐసీయూను మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారన్నారు. అత్యవసర చికిత్సల కోసం ఐసీయూకు వచ్చే రోగుల ప్రాణాలను రక్షించడమే ధ్యేయంగా లైవ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం అత్యాధునిక ఐసీయూ సేవలు చేరువ చేయడమే లక్ష్యంగా లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. తొలు త పైలెట్ ప్రాజెక్టుగా చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రిలో శనివారం ఉదయం 10 గంటలకు మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారని వివరించారు. అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగుల ఆరోగ్య పరిస్థితి ప్రతి నిమిషం స్మార్ట్ ఐసీయూ ద్వారా క్రిటికల్ కేర్ వైద్యులకు సమాచారం ఆన్‌లైన్ ద్వారా వస్తుందన్నారు. గుంటూరులోని శ్రీహాస్పటల్‌లో ఐసీయూ స్పెషాలిటీ వైద్యులు సదరు సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ రోగులకు తక్షణ చికిత్సకు సూచనలు, సలహాలు అందజేస్తారన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉపాధి అవకాశాలు

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



ఎమ్మెల్సీ అప్పిరెడ్డితో పతకాలు సాధించిన క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడా సాధనతో చక్కని ఆరోగ్యంతోపాటు ఉపాధి మార్గాలను కూడా మెరుగుపరచుకోవచ్చని శాసన మండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ స్టేడియం కూడా గతంలో ఎన్నడూ లేని అభివృద్ధికి నోచుకుంటుందని పేర్కొన్నారు. శాప్ లీగ్ పోటీలు నిర్వహించడం ద్వారా యువతలోని ప్రతిభ వెలుగులోకి వచ్చిందని చెప్పారు. త్వరలో ఆడుకుందాం– ఆంధ్ర క్రీడా పోటీలు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జరుగుతాయని చెప్పారు. రాష్ట్ర పతకాలు సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈచంపాటి ఆచారి, వైఎస్సార్ సీపీ నాయకులు అత్తోట జోసఫ్ సింగు నరసింహారావు చౌదరి, కార్పొరేషన్ ఈఈ సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానంలో కేఎల్‌యూ ఫస్ట్

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ హర్ష్ మంగ్లా



సర్టిఫికెట్ అందుకుంటున్న డాక్టర్ హనుమంత రావు, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్

తాడేపల్లిరూరల్: రక్తదానం చేయడంలో కేఎల్‌యూ ప్రథమ స్థానంలో ఉందని, రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణదానం చేయడమే అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ హర్ష్ మంగ్లా అన్నారు. శుక్రవారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా హర్ష్ మంగ్లా మాట్లాడుతూ రక్తం దొరకని క్లిష్ట పరిస్థితుల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు పలు సర్వే సంస్థలు వెల్లడిస్తున్న నివేదికలను చూస్తుంటే ఆందోళన కలుగుతోందన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చునని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి అత్యధిక రక్త యూనిట్లను అందించినందుకు కేఎల్‌యూకు ఎక్సలెన్స్ సర్టిఫికెట్ అందజేశారు. వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావుకూడా మాట్లాడారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు.

ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జె. నివాస్, రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, వైఆర్‌సి ప్రొఫెసర్ ఇన్‌చార్జి కటారి సుకీర్తి, కో ఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌మైండ్స్ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో అధ్యాపకులు, విద్యార్థులు


గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఇటీవల ప్రకటించిన సీఎంఏ ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల విద్యార్థులు అఖిల భారతస్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు అత్యధిక ర్యాంకులను కైవసం చేసుకున్న సందర్భంగా శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బ్రాడీపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి విద్యార్థులు, అధ్యాపకులతో ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహన ర్యాలీని మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ డైరెక్టర్ ఎస్ఎంఎస్ ప్రకాశరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ సీఎంఏ ఇంటర్, ఫైనల్ టాప్–10లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అత్యధికంగా 12 ర్యాంకులతో తిరుగులేని ఆధిక్యత కనబర్చారని చెప్పారు. మొత్తం 67 మంది విద్యార్థులు టాప్–50లో ర్యాంకులు కైవసం చేసుకున్నారని తెలిపారు. సీఎంఏ ఇంటర్‌లో ఎల్. వాగ్దేవ ఆలిండియా ప్రథమ ర్యాంకుతో పాటు వి. హేమంత్ ద్వితీయ ర్యాంకు సాధించినట్లు వివరించారు. అదే విధంగా సీఏ ఫైనల్‌లో పి. రాజేష్ ఆలిండియా 2వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. మాస్టర్ మైండ్స్ అకడమిక్ ప్రణాళికతో విద్యార్థులు కామర్స్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించడంతో పాటు అఖిలభారత స్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు.

సకల జీవరాశికి మొక్కలే ఆధారం

కొరిటెపాడు(గుంటూరు): మొక్కలు లేకపోతే ఏ జీవికి భూమిమీద మనుగడ లేదని, ప్రాణశక్తికి, ఆహారానికి, భూసారానికి, అందానికి మొక్కలు ఎంతో అవసరమని లాం ఫారం శాస్త్రవేత్త, టెర్రస్ గార్డెన్ కోర్సు ఇన్‌ఛార్జి పూర్ణిమ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాం ఫారంలో మూడు నెలల టెర్రస్ గార్డెన్ కోర్సులో శిక్షణ పొందిన వారికి క్షేత్ర సాయి సందర్శన సందర్భంగా బ్రాడీపేటలోని సీఎస్ఆర్ ఆర్గానిక్స్ సంస్థలో శుక్రవారం సదస్సు నిర్వహించారు.

డీఆర్ఎం కప్ క్రీడా పోటీలకు దరఖాస్తుల స్వీకరణ

- 6లోపు నమోదు చేసుకోవాలి
- పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలు వెల్లడించిన డీఆర్ఎం



పోస్టరు ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం

లక్ష్మీపురం: కనీవినీ ఎరుగనీ రీతిలో మొట్ట మొదటి సారిగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని డీఆర్ఎం కప్‌ను అధికారులు, ఉద్యోగస్తులు, డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు సైతం పాల్గొనే విధంగా ప్రణాళికలను రూపొందించడం జరిగిందని డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో డీఆర్ఎం కప్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని డీఆర్ఎం కప్ మొట్ట మొదటి సారిగా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనేందుకు అక్టోబర్ 6వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకుని నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే క్రికెట్ పోటీలను నల్లపాడు పేరెడ్ గ్రౌండ్స్, పోలీస్ పరేడ్ గ్రౌండ్ క్రీడా ప్రాంగణాలలో అన్ని విధాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్రికెట్ పోటీలు అక్టోబర్ 7,8,14,15వ తేదీలలో నిర్వహిస్తున్నామన్నారు. . అలాగే వాలీబాల్ అక్టోబర్ 7,8 తేదీలలో గుంటూరు పట్టాభిపురం డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా బ్యాడ్మింటన్ పోటీలను అక్టోబర్ 7,8 తేదీలలో పట్టాభిపురం డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పోటీలలో నిర్ణయం అంపైర్‌దేనన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 6వ తేదీ లోగా రైల్వే అధికారులను సంప్రదించ వచ్చని తెలిపారు. సంప్రదించాల్సిన వారు గీతా, ఓఎస్‌డి 9121139141, వై.శ్రీనివారావు కో ఆర్డినేటర్ 9347785888 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.